సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం, 10 ఏప్రిల్ 2025



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కోనరావుపేట: మండలకేంద్రంలోని పీఎం శ్రీ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్లటౌన్: ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. టీపీసీసీ కోఆర్డినేటర్ అవేజు, చొప్పదండి ప్రకాశ్ ఉన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.



జై భజరంగ్ భళీ

సిరిసిల్లకల్చరల్: భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్లలో వీరహనుమాన్ శోభాయాత్ర కనులపండువగా సాగింది. సద్గురు సమర్థ మహారాజ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. హనుమాన్ దీక్షాపరులతో ప్రధాన రహదారులు కాషాయమయం అయ్యాయి. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, భజరంగదళ్ ప్రతినిధులు బుర్ర లింగమూర్తి, గుంటుకు పురుషోత్తం, బండారి అశోక్, కొమిరె గౌతమ్, క్రాంతి పాల్గొన్నారు.





కనులపండువగా రథోత్సవం

- ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దత్తత సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం కనులపండువగా సాగింది. మహిళలు మంగళహారతులతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 7 గంటలకు ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ అర్చకుడు వేణుగోపాలచారి ప్రకటించారు. టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, మాజీ ఎంపీటీసీ అపెరా సుల్తాన, అర్చకులు నవీన్‌చారి, ఆలయ కమిటీ చైర్మన్ మోతె లక్ష్మారెడ్డి, నాయకులు ఎలుసాని మోహన్‌కుమార్, నిమ్మ మల్లారెడ్డి, లింగాల అంజాగౌడ్, లద్దునూరి హన్మండ్లు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆకురాలిన అడవిలో చిగురు తొడగిన అందాలు

ఇది ఆకురాలే కాలం. కాకులు దూరని కారడివి సైతం కనుచూపు మేరలో ఏమి ఉందో కనిపించేలా మోడుబారిపోయింది. అయితే అడవిలోని అన్ని చెట్లు ఆకులు రాలి బోసిపోగా.. అక్కడక్కడ కొన్ని చెట్లు మాత్రం చిగురు తొడిగి ఆ అడవికి బొట్టుచుక్కలా కనిపిస్తున్నాయి. కాషాయం, లేత ఆకుపచ్చ వర్ణాలతో అడవికే అందాన్ని తెచ్చాయి. ఈ దృశ్యాలు కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి మానాల వెళ్లే దారిలో ఆవిష్కృతమయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

న్యూస్‌రీల్

భ్రూణహత్యల విచారణలో పురోగతి

సాక్షి ఎఫెక్ట్..

చందుర్తి (వేములవాడ): భ్రూణహత్యల విచారణలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం పురోగతి సాధించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రజిత తెలిపిన వివరాలు. చందుర్తి మండలంలో జరిగిన భ్రూణహత్యలపై రెండు రోజులుగా కొనసాగుతున్న విచారణలో బాధితురాలు ఇచ్చిన సమాచారంతో వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో రజిత తెలిపారు.

సానుకూల దృక్పథంతో సమస్యలు పరిష్కారం

- ప్రముఖ సైకాలజిస్ట్ పున్నంచందర్



నెహ్రూనగర్‌లో కార్మికులతో మాట్లాడుతున్న సైకాలజిస్ట్ పున్నంచందర్

సిరిసిల్ల: సానుకూల దృక్పథంతో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ పేర్కొన్నారు. స్థానిక నెహ్రూనగర్‌లో బుధవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మైండ్‌కేర్ సెంటర్, కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సామూహిక కౌన్సెలింగ్ నిర్వహించారు. పున్నంచందర్ మాట్లాడు భార్యాభర్తల మధ్య వివాదాల పరిష్కారం కోసం మైండ్‌కేర్ సెంటర్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటే వివాదాలకు తావే ఉండదన్నారు. మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది కొండ ఉమ, వేములఅన్నపూర్ణ, రాపెల్లి లత, బూర శ్రీమతి, కిమ్స్ కళాశాల విద్యార్థులు జి.పద్మ, జి.పూజిత, వి.సుస్మిత, నాగుల వందన, జె.అనుపమ అంజనీ, డి.మానస పాల్గొన్నారు.

జ్యువెల్లరీ షాపులకు అనుమతులు ఇవ్వొద్దు



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న స్వర్ణకారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ముస్తాబాద్‌లో జ్యువెల్లరీ దుకాణాల ఏర్పాటుపై స్వర్ణకారుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన చేశారు. స్వర్ణకారుల సంఘం మండలాధ్యక్షుడు చింతోజు బాలయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు దుకాణాలు పెడుతుండడంతో స్థానికులకు ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల బంగారం దుకాణాల ఏర్పాటుకు ముస్తాబాద్ మండలంలో అనుమతులు ఇవ్వరాదని తహసీల్దార్ సురేశ్, ఎస్సై గణేశ్, ఈవో రమేశ్‌లకు ఫిర్యాదు చేశారు. స్వర్ణకారులు సంఘం నాయకులు విశ్వనాథం, ఈశ్వరయ్య, అనిల్, సతీశ్, చేపూరి రవి, శ్రీనివాస్, సాయిలక్ష్మణ్, సంతోష్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కొసముట్టని కాళేశ్వరం

- 'ఎత్తిపోతలు' పూర్తయ్యేది ఎన్నటికో ?
- వట్టిపోతున్న పంప్‌హౌస్‌లు
- నిలిచిన భూసేకరణ.. ముందుకుసాగని కాల్వలు
- రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే..
- అన్నదాతల ఆశలు ఆది శ్రీనివాస్‌పైనే...



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఇది కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్. మూడు టీఎంసీల సామర్థ్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–9లో భాగంగా నిర్మించారు. మధ్యమానేరు జలాశయం నుంచి నీటిని సొరంగం ద్వారా మళ్లించి దీనిని నింపుతారు. ఇటీవల మధ్యమానేరు నీటిని మల్కపేట చెరువులోకి పంపింగ్ చేయడంతో ఒక్క టీఎంసీ చేరింది. ఈ నీటిని ఎడమకాల్వ ద్వారా ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలకు అందించాల్సి ఉంది. కుడికాల్వ ద్వారా కోనరావుపేట, వేములవాడఅర్బన్ మండలాలకు సాగునీరు అందించాలి. కానీ మల్కపేట వరకు మాత్రమే గోదావరి జలాలు చేరాయి.



ఇది కోనరావుపేట మండలం మల్కపేట–కనగర్తి మధ్య నిర్మించిన కుడికాల్వ. భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. మల్కపేట జలాశయంలో నీరున్నా ఈ కాల్వకు విడుదల చేయలేని దుస్థితి. కాల్వ పూర్తయితే మల్కపేట, కనగర్తి, ధర్మారం, సుద్దాల, మంగళ్లపల్లి, లింగంపల్లి, మారుపాక వరకు గోదావరి జలాలు చేరేవి. కానీ భూసేకరణకు నిధులు లేక పనులు మధ్యలోనే ఆగిపోయాయి.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ వద్ద నిర్మించిన పంప్‌హౌస్. మల్కపేట జలాశయం ఎడమ ప్రధాన కాలవ్వపైన నిర్మించారు. దీనిలో రెండు మోటార్లు అమర్చి వీర్నపల్లి మండలం మద్దిమల్ల, కంచర్ల గ్రామాల చెరువులు నింపాలి. 2,435 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. పంప్‌హౌస్ పనులను మధ్యలోనే వదిలేశారు. ప్రభుత్వం మారడంతో పనులు చేయించేవారు లేక కాళేశ్వరం–9 ప్యాకేజీలో చేపట్టిన ఈ పనులు ఆగిపోయాయి.

సిరిసిల్ల: కాళేశ్వరం–9వ ప్యాకేజీలో గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు వరకు గోదావరి జలాలను తరలించాల్సి ఉంది. కానీ మల్కపేట నుంచి కాల్వల పనులు పూర్తికాకపోవడం.. మధ్యలో ఉన్న పంపుహౌస్ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో నీరు రావడం లేదు. ఈ పనులను 2017 అక్టోబరులో అప్పటి సీఎం కేసీఆర్ రూ.166కోట్లతో మంజూరు చేశారు. 10వేల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యంగా చేపట్టిన అదనపు ఎత్తిపోతలు మధ్యలో ఆగిపోయాయి. పంపుహౌస్‌లను నిర్మించి, పైపులైన్లు వేసి, మల్కపేట రిజర్వాయర్ ద్వారా నీటిని మళ్లిస్తే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని మెజార్టీ గ్రామాలకు శాశ్వతంగా సాగునీటి సమస్య తీరనుంది. కానీ ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

రైతుల ఆశలు ఆది శ్రీనివాస్‌పైనే...

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలుమార్లు శాసనసభలో మల్కపేట రిజర్వాయర్, అదనపు ఎత్తిపోతల పథకం పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి 2024 నవంబరు 20న వేములవాడకు వచ్చిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు



–9వ ప్యాకేజీని, అదనపు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా సమీక్షించి పనులు జరిగేలా చూస్తామన్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ చూపితే.. ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరవుతాయని, భూసేకరణ సమస్యలు తొలగిపోయి, అటవీశాఖ అనుమతులు లభించి, కాల్వలు, పైపులైన్ పనులు గాడిలో పడే అవకాశం ఉందని జిల్లా రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఆ దిశగా ఆయన కృషి చేసి కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో చేపట్టిన అదనపు ఎత్తిపోతల పథకాలను పూర్తిచేస్తారని రైతులు ఆశిస్తున్నారు.



ఇది వీర్నపల్లి మండలం మద్దిమల్ల చెరువు. ఈ చెరువులో నీరుంటే వీర్నపల్లితోపాటు మండలంలోని గిరిజనతండాలకు పుష్కలంగా నీరు లభించేది. కానీ పైపులైన్ పనులు నిలిచిపోవడంతో గోదావరి జలాలు మద్దిమల్ల చెరువులోకి చేరలేదు. మరోవైపు ఇదే మండలంలోని గర్జనపల్లి వద్ద మూడు పంపులతో మరో పంపుహౌస్ నిర్మించాల్సి ఉండగా.. అటవీశాఖ అనుమతులు లేక పనులు ఆగిపోయాయి. మొదటి పంపుతో మరిమడ్ల, గర్జనపల్లి గ్రామాలకు, రెండో పంపుతో వన్‌పల్లి, గర్జనపల్లి, మూడో పంపుతో అడవిపదిర, రంగంపేట గ్రామాల్లోని 3,581 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ పంప్‌హౌస్ నిర్మాణం, భూసేకరణ అనుమతులు లేక పనులు ఆగిపోయాయి.



ఇది కోనరావుపేట మండలం నిమ్మపల్లి శివారులో నిర్మించిన పంప్‌హౌస్. ఇందులో రెండు మోటార్లు బిగించి మలక్పేట జలాశయం నుంచి గోదావరి జలాలను నిమ్మపల్లి మూలవాగు జలాశయంలోకి పంపింగ్ చేస్తారు. మూలవాగు జలాశయానికి ఉన్న కుడి, ఎడమ కాల్వల ద్వారా నిమ్మపల్లి, కొండాపూర్, వట్టిమల్ల గ్రామాల పరిధిలోని 2,800 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మూలవాగులోకి నీరు విడుదల చేస్తే.. వాగు వెంట ఉన్న నిమ్మపల్లి నుంచి గోవిందరావుపల్లి, కొండాపూర్, వెంకట్రావుపేట, బావుసాయిపేట, మామిడిపల్లి, కనగర్తి, హన్మాజీపేట, లింగంపల్లి, మల్లారం, బొల్లారం, జయ్యారం, వేములవాడ వరకు సాగునీరు లభిస్తుంది.

పూజలు.. దర్శనాలు

- ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కేటీఆర్



కేటీఆర్‌కు సీతారాముల చిత్రపటాన్ని బహూకరిస్తున్న మాలధారులు

సిరిసిల్ల/కోనరావుపేట/గంభీరావుపేట: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో హనుమాన్‌మాలధారులతో కలిసి భజనలు చేసి, సహపంక్తి భిక్షలో పాల్గొన్నారు. హనుమాన్ మాలధారులు కేటీఆర్‌కు సీతారాముల చిత్రపటాన్ని అందించారు. జిల్లా పర్యటనలో కేటీఆర్ ఎక్కడా రాజకీయాల గురించి మాట్లాడలేదు. కోనరావుపేట మండలం మల్కపేట సీతారామచంద్రస్వామి ఆలయం, గంభీరావుపేట మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయ 50వ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మల్యాల దేవయ్య, చంద్రయ్య, బండ నర్సయ్య, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో మహిళా సంఘాలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం మహిళా సంఘాల ద్వారానే కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని బాలానగర్, రూరల్ మండలం చెక్కపల్లి, మల్లారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 248 సెంటర్లను ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 35 సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వసంతలక్ష్మి, మార్కెట్ డీఎం రజిత, డీసీవో రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, వేములవాడ, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రొండి రాజు, చెల్కల తిరుపతి, వైస్‌చైర్మన్ కనికరపు రాకేశ్, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు దైత కుమార్, రాజయ్య పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొంటాం

కోనరావుపేట(వేములవాడ): రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. కోనరావుపేట, నిజామాబాద్‌లో సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో క్వింటాల్‌కు అదనంగా రూ.500 ఇస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఏవో సందీప్, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సన్నబియ్యం లబ్ధిదారు గణేశ్ ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండల కేంద్రంలో ఐకేపీ సంఘాలకు అప్పగించిన వరిధాన్యం, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ప్రారంభించారు. మండలంలోని సిరికొండలో లబ్ధిదారు సత్యనారాయణ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామంలో 42 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముగ్గులు పోసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిష్టర్‌ను పరిశీలించారు. రక్తపరీక్షలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పల్లె దవాఖానాలో పీహెచ్‌సీ నిర్వహణ సౌలభ్యంగా లేకపోవడంతో అదనంగా పక్కనున్న మహిళా సంఘాల ఏవో భవనం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో శేషాద్రిని ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. మండల పరిషత్ 67 మందికి సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని సన్నబియ్యం లబ్ధిదారు గణేశ్ ఇంట్లో ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా అధికారులు భోజనం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకోసం ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ ఎంఏ ఫరూక్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం వాణిశ్రీ, హౌసింగ్ ఏఈ హకీం, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎలగందుల ప్రసాద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వి.వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య పాల్గొన్నారు.

మానేరువాగులో చెక్‌డ్యాం మళ్లీ నిర్మించాలి

సిరిసిల్ల: మానేరువాగులో గతంలో కొట్టుకుపోయిన చెక్ డ్యాంను పునర్ నిర్మించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదేశించారు. నెహ్రూనగర్ వద్ద దెబ్బతిన్న చెక్‌డ్యాంను ఈఎన్సీ శంకర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. విద్యానగర్ మానేరు వంతెన నుంచి సాయిబాబా ఆలయం వరకు మూడు కిలోమీటర్ల పొడవు కరకట్ట పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈఈలు అమరేందర్‌రెడ్డి, కిశోర్ పాల్గొన్నారు.

రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

సిరిసిల్లకల్చరల్: వ్యవసాయశాఖ అధికారులు



రైతులకు నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ సూచించారు. ఏవోలు, ఏఈవోలతో బుధవారం సమీక్షించారు. పంటకోతలు పూర్తయిన రైతులకు టోకెన్లు జారీ చేయాలన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


దేవయ్య(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన కోనరావుపేట మండలం ధర్మారంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. ధర్మారం గ్రామానికి చెందిన మల్యాల దేవయ్య(48) స్థానికంగా డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం సాయంత్రం వరికోత మిషన్ ద్వారా కోసిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నాడు. ఈక్రమంలోనే ఓ రైతు పొలం వద్ద ట్రాక్టర్ ఇంజిన్‌ను ఆన్‌లోనే ఉంచి కిందికి దిగాడు. హఠాత్తుగా ట్రాక్టర్ ముందుకు కదలడంతో ఆపే క్రమంలో కాలు జారి టైర్ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ దేవయ్యను సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య దేవవ్వ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మల్కపేటలో వృద్ధుని అదృశ్యం


కట్ల పర్శయ్య

కోనరావుపేట (వేములవాడ): మల్కపేటకు చెందిన కట్ల పర్శయ్య(65) ఆచూకీ రెండు నెలలుగా లభించడం లేదు. పర్శయ్య గత ఫిబ్రవరి 7న పింఛన్ డబ్బుల కోసం ఆటోలో సిరిసిల్లకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం డీపీవో, మండల ప్రత్యేకాధికారి ఎండీ.షరీఫుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటుచేసిన రాజీవ్ యువవికాసం హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.లక్ష్మీనారయణ, ఎంపీవో మీర్జా బేగ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బండలింగంపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామివారి విగ్రహా లను రథంపై ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

మురుగునీటి సరఫరా



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కాలనీలో బుధవారం సైతం నల్లా ద్వారా మురుగునీరు సరఫరా అయింది. దీంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాలనీలో గత పది రోజుల క్రితం మురుగునీరు సరఫరా కావడంతో చాలా మంది చర్మవ్యాధులతో ఇబ్బంది పడ్డారన్నారు. మళ్లీ బుధవారం సైతం మురికి నీరు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అతివలకు రెడీమేడ్ ఉపాధి

- రేపు అపెరల్ పార్క్‌లో టెక్స్‌ఫోర్ట్ యూనిట్ ప్రారంభం
- హాజరవుతున్న నలుగురు మంత్రులు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలు కుడుతున్న మహిళలు (ఫైల్)


టెక్స్‌టైల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



ప్రారంభోత్సవానికి సిద్ధమైన యూనిట్

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రాంతంలోని మహిళలకు శాశ్వత ఉపాధిని అందించేందుకు ఆధునిక వస్త్రాల తయారీ యూనిట్ సిద్ధమైంది. జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దూరు అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీసంస్థ టెక్స్‌ఫోర్ట్ కంపెనీ యూనిట్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, చేనేత, జౌళిశాఖ జేడీ ఎస్.వెంకటేశ్వర్‌రావు, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, జౌళిశాఖ ఏడీ రాఘవరావు, టెక్స్‌ఫోర్ట్ కంపెనీ ప్రతినిధులతో బుధవారం సమీక్షించారు.

రెండు వేల మందికి ఉపాధి

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని రెండు వేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో టెక్స్‌ఫోర్ట్ కంపెనీ ముందుకొచ్చింది. రెండు ఎకరాల్లో టెక్స్‌ఫోర్ట్ గార్మెంట్ యూనిట్‌ను నిర్మించారు. అపెరల్ పార్క్‌లో ఇప్పటికే గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇక్కడ 500 మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. మరో వెయ్యి మందికి ఉపాధి కల్పించే దిశగా ఆ కంపెనీ యూనిట్‌ను విస్తరిస్తోంది. గోకుల్‌దాస్ సంస్థలో లోదుస్తులను తయారీచేస్తూ విదేశాలకు ఎగుమతి చేస్తోంది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికాకు వస్త్రాలు వెళ్తున్నాయి. ఇప్పుడు టెక్స్‌ఫోర్ట్ అనే మరో అంతర్జాతీయ సంస్థ సిరిసిల్లలో పరిశ్రమను స్థాపించేందుకు ముందుకు రావడంతో 1600 మంది మహిళలు, మరో 400 మంది స్టాఫ్‌కు ఉపాధి లభించనుంది. శుక్రవారం టెక్స్‌ఫోర్ట్ యూనిట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆధునిక జీన్స్, టీషర్ట్, అండర్‌వేర్స్ కుట్టుపై మహిళలకు ఇప్పటికే శిక్షణ ఇస్తున్నారు.

చేయి..చేయి కలిపారు.. అభివృద్ధి సాధించారు

- సుస్థిరాభివృద్ధిలో రాష్ట్రంలో పదో స్థానం
- బండపల్లిలో పుష్కలంగా తాగు, సాగునీరు
- ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధిలో ప్రగతి


గ్రామంలో ఏర్పాటు చేసిన సామూహిక ఇంకుడు


బండపల్లి గ్రామపంచాయతీ

చందుర్తి(వేములవాడ): వారంతా గ్రామీణులు.. ఐకమత్యంలో ఆదర్శప్రాయులు.. గ్రామంలో అమలయ్యే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకుసాగుతున్నారు. సామూహిక ఇంకుడుగుంతలు.. పారిశుధ్య నిర్వహణ.. ఆదర్శమైన తాగు, సాగునీటి నిర్వహణతో చందుర్తి మండలం బండపల్లి గ్రామం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసిన సుస్థిరాభివృద్ధి 2022–23 జాబితాలో రాష్ట్రంలోనే పదోస్థానంలో నిలిచింది. ఆ గ్రామం సాధించిన ప్రగతిపై ప్రత్యేక కథనం.

పల్లెసిగలో ప్రగతి విరులు

బండపల్లిలో వలసలు అరికట్టేందుకు ఉపాధిహామీ కూలీలకు ప్రణాళికాబద్ధంగా పనులు కల్పించారు. గ్రామపంచాయతీ పరిధిలోని మహిళలు, యువత జీవనోపాధికి చేపట్టిన కార్యక్రమాలను పరిగణలోకి తీసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పీహెచ్‌సీలో వసతులు కల్పించారు. తాగునీరు, సాగునీటి అవసరాలు, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం, సుపరిపాలన, సామాజిక భద్రతపై అధికారులు ఫోకస్ చేశారు. ఆయా అంశాల్లో గ్రామం సాధించిన ప్రగతిని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ గుర్తించింది. రాష్ట్రంలోని టాప్ 25 గ్రామాల్లో బండపల్లికి పదో స్థానం దక్కింది.

సంతోషంగా ఉంది



సుస్థిరాభివృద్ధిలో తొమ్మిది అంశాలతో కూడిన వాటిలో సాధించిన ప్రగతి ఆధారంగా మా గ్రామానికి పదో స్థానం దక్కడం సంతోషంగా ఉంది. నా ఐదేళ్ల పాలనకు దక్కిన గుర్తింపు.

– న్యాత విజయ, మాజీ సర్పంచ్

ప్రజల సహకారంతో..



గ్రామ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ సహకారం అందించారు. గ్రామంలోని యువకులు, ప్రజల సహకారంతో ప్రగతిని సాధించాం. పన్నుల చెల్లింపులు, పారిశుధ్య నిర్వహణలో ముందున్నాం.

– రమేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి

మూడు రోజుల్లో ఇద్దరు స్నేహితులు మృతి

- రంజాన్‌కు ముందు రోజు రోడ్డు ప్రమాదం
- హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స
- మూడు రోజుల క్రితం ఒకరు.. నేడు మరొకరు
- నారాయణపూర్‌లో విషాదం


అఫ్రోజ్, అవీజ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారిద్దరు చిన్ననాటి నుంచి కలిసి తిరిగారు. ఒకరిని విడిచి మరొకరు ఉండలేకపోయారు. మరణంలోనూ వీడలేమంటూ కలిసి వెళ్లిపోయారు. ఇటు కన్నవాళ్లకు కడుపుకోతను మిగిల్చారు. స్నేహితులకు జ్ఞాపకంగా మిగిలిపోయారు. మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరు స్నేహితులు మృతిచెందడంతో ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో విషాదం అలుముకుంది. గత నెల 30వ తేదీన రంజాన్ పండుగ కోసం దుస్తులు తెచ్చుకునేందుకు మండలంలోని నారాయణపూర్‌కు చెందిన అవీజ్, అఫ్రోజ్ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. వీరు మండలంలోని హరిదాస్‌నగర్ శివారుకు చేరుకోవడంతోనే ఎదురుగా ఆటో రావడంతో ద్విచక్రవాహనం, ఆటో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అవీజ్, అఫ్రోజ్‌లను మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అవీజ్‌ను హైదరాబాద్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మూడు రోజుల క్రితం ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం అఫ్రోజ్ మృతిచెందాడు. మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కోడికోసం వెళ్లి.. బావిలో దూకి..

కమాన్‌పూర్(మంథని): వరి పంటను కోసేందుకు సిద్ధమైన రైతు నామని రాజేశం(70) ఆచారం ప్రకారం పొలం వద్ద కోడిని బలిచ్చే ప్రయత్నంలో సమీప వ్యవసాయ బావిలోపడి దుర్మరణం చెందాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లెలో బుధవారం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో తనకున్న వరిపొలం వద్దకు బుధవారం ఉదయం కోడిని పట్టుకుని వెళ్లాడు. వరి పైరు కోసేందుకు ముందుగా కోడిని బలి ఇవ్వాలని నిర్ణయించాడు. తనవెంట తెచ్చుకున్న సంచిలోనుంచి కోడిని తీస్తుండగా అది ఎగిరిపోయి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడింది. రాజేశం ఆ కోడిని పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు ఆ బావిలో పడి మృతి చెందాడు. చాలాసేపటి వరకు రాజేశం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ అటూఇటూ చూడగా ఎక్కడా కనిపించలేదు. చివరకు వ్యవసాయ బావిలో చూడగా శవమై కనిపించాడు. అప్పటిదాకా తమతో ఉన్న రాజేశం బావిలోపడి విగతజీవిగా మారడంతో కుటుంబసభ్యుల విలపించారు.

హార్వెస్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ఆర్టీసీ బస్సు

తిమ్మాపూర్: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయం సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు హార్వెస్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సులోని పలువురితోపాటు, హార్వెస్టర్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోవడంతో పోలీసుల రెండు గంటలు శ్రమించి బయటకు తీశారు. ఎల్ఎండీ పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి 12:40 గంటల సమయంలో ఇందిరానగర్ గ్రామ సాయిబాబా గుడివద్ద కరీంనగర్ వైపు వెళుతున్న హార్వెస్టర్‌ను హైదరాబాద్ నుంచి కరీంనగర్‌వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో హార్వెస్టర్ రోడ్డు అవతలివైపుదూసుకెళ్లి బోల్తాపడింది. బ్లేడ్‌లు మాత్రం బస్సులు ఇరుక్కుపోయాయి. ఈ ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో బస్సులోని పలువురితోపాటు హార్వెస్టర్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. హార్వెస్టర్ డ్రైవర్ వాహనంలో ఇరుక్కుపోయాడు. స్థానికులు వెంటనే 108, ఎల్ఎండీ పోలీసులు సమాచారం అందించారు. దాదాపు 2 గంటలకు పైగా పోలీసులు, గ్రామస్తులు, హైవే పెట్రోల్ సిబ్బంది, మూడు 108 అంబులెన్స్ సిబ్బంది శ్రమించి బయటకు తీయగా.. మోకాలు విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

తండ్రిని చంపిన కొడుక్కి యావజ్జీవం

జగిత్యాలజోన్: కని, పెంచిన తండ్రిని కర్కశంగా హత్య చేసిన కొడుక్కి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం గొడిసెలపేట గ్రామానికి చెందిన రెబ్బాసు పోచయ్య, మల్లవ్వకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. వీరికున్న ఇంటితోపాటు ఇంటి స్థలాన్ని పెద్ద కుమారుడు లచ్చయ్య, చిన్న కుమారుడు గట్టయ్యకు సమానంగా పంచి ఇచ్చారు. తనకు వాటా గా వచ్చిన స్థలాన్ని గట్టయ్య విక్రయించగా లచ్చ య్య కొన్నాడు. తల్లిదండ్రులు లచ్చయ్య ఇంటివద్దే ఉంటున్నారు. తన ఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ లచ్చయ్య తల్లిదండ్రులతో గొడవకు దిగుతున్నాడు. వారికి ప్రత్యామ్నాయం లేక లచ్చయ్య వద్దే ఉంటున్నారు. 2022 ఏప్రిల్ 1న ఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ తల్లిదండ్రులను కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. పోచయ్య అరుపులు విని చుట్టుపక్కల వారు వచ్చేసరికి లచ్చయ్య పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన పోచయ్యను కరీంనగర్‌కు.. అక్కడి నుంచి వరంగల్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి వెల్గటూర్ ఎస్సై ఎ.నరేశ్‌కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బిల్లా కోటేశ్వర్ కేసును దర్యాప్తు చేసి నిందితుడు రెబ్బాసు లచ్చయ్యను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, వి.శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టగా పరిశీలించిన జడ్జి నిందితుడైన లచ్చయ్యకు యావజ్జీవ కారాగారశిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భీమన్న గుడిలో రాజన్న దర్శనాలు


భీమేశ్వరాలయం

- జూన్ 15 నుంచి ఆలయ విస్తరణ పనులు
- ఉన్నతాధికారులతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక సమావేశం
- శృంగేరిమఠంలో కల్యాణాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టనుంది. జూన్ 15న ప్రారంభం కానున్నాయి. ప్రధాన ఆలయం మినహా మిగతా పనులు చేపట్టనున్నారు. ఈ పనులతో భక్తులకు స్వామివారి దర్శనాల్లో అంతరాయం కలగకుండా ఉండేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భీమన్నగుడిలో రాజన్నను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. శృంగేరి పీఠాధిపతుల సూచన మేరకు ఆలయ ప్రాంగణ విస్తరణ, దర్శన మార్గాల అభివృద్ధి, అదనపు మండపాలు, పార్కింగ్ సదుపాయం, లైటింగ్ వ్యవస్థలతోపాటు పౌరాణికతకు హాని కలగకుండా ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు ప్రణాళికలు రూపొందించారు. ఈ పనులు వేగవంతంగా పూర్తిచేసేందుకు ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తీసుకుంటున్నారు.

సీఎం పర్యటనతో పనుల్లో కదలిక

గత నవంబర్ 20న సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న గుడికి చేరుకుని రూ.47 కోట్లతో విస్తరణ పనులు చేపట్టేందుకు భూమిపూజ నిర్వహించిన విషయం తెలిసిందే. బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ధర్మగుండాన్ని తాత్కాలికంగా మూసివేసి పార్కింగ్ స్థలంలో షవర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భీమన్న ఆలయంలోనే కోడెమొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భీమన్నగుడికి ప్రస్తుతం ఉన్న ప్రధాన ద్వారంతోపాటు మరో ద్వారాన్ని శృంగేరి పీఠాధిపతుల అనుమతులతో చేపట్టనున్నారు. ఈనెల 15న దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆర్అండ్‌బీ శాఖల అధికారులు వేములవాడలో పర్యటించి పూర్తి ప్రణాళిక తయారు చేయనున్నారు. దీనిపై 16 దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో సమావేశమవుతారు. తుది ప్రణాళికపై సూచనలు, సలహాల కోసం ఈనెల 17న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులు శృంగేరిపీఠానికి వెళ్తారు. అయితే ఇప్పటికే భీమన్నగుడిలో వివిధ ఏర్పాట్లు చేసేందుకు శృంగేరిపీఠాధిపతుల నుంచి రాజన్న ఆలయ అధికారులకు అనుమతిపత్రాలు వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు.

పలు సూచనలు ఇచ్చాం



ఆలయ అభివృద్ధిపై సలహాలు, సూచనలు ఇచ్చాం. శృంగేరిపీఠాధిపతుల నిర్ణయమే ఫైనల్‌గా ఉంటుంది. భీమన్నగుడిలో భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేసినా నిత్యం జరగాల్సిన పూజలు రాజన్న గుడిలో తప్పకుండా నిర్వహిస్తాం. నిత్య కైంకర్యాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చర్యలు తీసుకుంటాం.

– చంద్రగిరి శరత్‌శర్మ

శృంగేరిపీఠాధితుల సూచనల మేరకు..



రాజన్న ఆలయాన్ని రానున్న వేయి ఏళ్లకు సరిపడా సౌకర్యాలతో విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేసి రూ.47కోట్లు కేటాయించారు. మళ్లీ బడ్జెటల్ రూ.100 కోట్లు కేటాయించారు. విస్తరణ పనులు పూర్తయ్యే వరకు భక్తులకు భీమన్న గుడిలో దర్శనాల ఏర్పాట్లు చేయనున్నాం.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

చందుర్తి సింగిల్‌విండోలో భారీ కుంభకోణం

- విచారణలో బయటపడ్డ రూ.1.68కోట్ల అవినీతిపర్వం
- సీఈవో స్వాహా చేసిన సొమ్ము రూ.1.03లక్షలు
- పాలకవర్గం రికవరీ చేయాల్సిన సొమ్ము రూ.65లక్షలు


విచారణ చేస్తున్న అధికారి (ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో భారీ కుంభకోణం బయటపడింది. ఇప్పటికే రైతుల పేరిట పంట రుణాలను తీసుకుని స్వాహా చేసిన సీఈవో గంగారెడ్డిని ఐదు నెలల క్రితమే సస్పెన్షన్ చేయగా.. పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా సింగిల్‌విండో సొసైటీలో జరుగుతున్న 51 విచారణలో మరిన్ని విషయాలు బయటపడ్డాయి. సొసైటీలో రూ.1.68కోట్లు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలింది. ఇందులో రూ.1.03కోట్లు సస్పెన్షన్‌కు గురైన సీఈవో గంగారెడ్డి స్వాహా చేశాడని తేలింది. అంతేకాకుండా మరో రూ.65లక్షలను సొసైటీలో వ్యక్తిగత రుణాలతోపాటు దీర్ఘకాలిక రుణాలు అందించారు. ఈ బకాయిలను 2013 నుంచి ఇప్పటి వరకు పాలకవర్గం సభ్యులు వసూలు చేయించకపోవడంతో బకాయి పడ్డాయని, వీటి వసూలుకు గత పాలకవర్గం సభ్యులు, ప్రస్తుత పాలకవర్గం సభ్యులతోపాటు సీఈవోలను బాధ్యులను చేస్తూ ఆ సొమ్ము వసూలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సహకార సంఘం అధికారులు విచారణ నివేదికను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లతోపాటు స్థానిక సొసైటీ ఇన్‌చార్జి సీఈవో శ్రీవర్ధన్‌లకు అందజేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై చందుర్తి ఇన్‌చార్జి సీఈవో శ్రీవర్ధన్ వివరణ కోరగా నెల రోజుల్లోపు పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేసి.. బహిర్గతం చేయాలన్న నింబంధనలు ఉన్నాయని విషయాన్ని దాట వేశారు.

చందుర్తి సొసైటీపై కలెక్టర్ ఆరా?

చందుర్తిలోని కొందరు రైతులు స్థానిక సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతోపాటు కేంద్రమంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా ఇదే విషయమై జిల్లా కలెక్టర్ చందుర్తి సొసైటీ సిబ్బందిని, సహకార సంఘం అధికారులను విచారణ నివేదికతో కలెక్టర్ కార్యాలయానికి రావాలని ఆదేశించినట్లు స్థానికంగా ప్రచారం ఉంది.

సర్ధాపూర్‌లో ఆయుధాగారం ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్


సర్ధాపూర్‌లో పోలీస్ ఆయుధాగారాన్ని ప్రారంభిస్తున్న డీఐజీ సన్నీ

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో కొత్తగా నిర్మించిన ఆయుధగారం (బెల్ ఆఫ్ ఆర్మ్స్)ను వర్చువల్‌గా టీజీఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ బుధవారం ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంజయ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ బెటాలియన్ పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ క్రమశిక్షణ గల ఆర్గనైజేషన్ అని వివరించారు. బెటాలియన్ అభివృద్ధిలో అధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమన్నారు. సర్ధాపూర్ బెటాలియన్‌కు వచ్చిన డీఐజీ సన్నీకి కమాండెంట్ సురేష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన దోబీ, బార్బర్ రూమ్‌లను డీఐజీ సన్నీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

చమురు ధరలు తగ్గించాలి

- కేంద్ర ప్రభుత్వ తీరుపై సీపీఐ నిరసన


అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ నిరసన

సిరిసిల్లటౌన్: పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. కేంద్ర ప్రభుత్వం తీరుపై బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, కడారి రాములు, అజ్జ వేణు, లక్ష్మన్, రామస్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

పెంచిన వంట గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామని వనిత కోరారు. సిరిసిల్లలో బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందజేస్తే.. ప్రధాని మోదీ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను ఎప్పుడూ చిన్న చూపే చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.